## మైనర్ బాలికపై ఎలక్ట్రీషియన్ లైంగిక వేధింపులు

మెండోర, బతుకమ్మ :మండలంలోని పోచంపాడ్ బాలికల గురుకుల పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న మైనర్ బాలికను అదే పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఎలక్ట్రిషన్ లైంగిక వేధింపులకు గురిచేస్తుండగా ఈ విషయం శనివారం వెలుగులోకి వచ్చింది. గతంలో ఇద్దరమ్మాయిలు మృతి చెందిన విషయం భయాందోళనకు గురిచేయగా.. తాజాగా ఓ బాలిక తాను చనిపోతానంటూ తల్లిదం డ్రులకు లేఖ రాసింది. ఆ పాఠశాలలో ఎలక్ట్రిషియన్‌గా పనిచేసే ఓ వ్యక్తి బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించడమేగాక, హాస్టల్‌లో వారు బాత్‌రూం వెళ్లి సమయంలో లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు వెలుగులోకి వచ్చింది. ఈ విషయం తన తల్లిదండ్రులకు ఆలస్యంగా తెలియజేసిన ఓ బాధితురాలు.. ప్రతినిత్యం నరకయాతన అనుభవి స్తున్నట్లు తెలిసింది. జరిగిన విషయాన్ని బాధితురాలి తల్లిదండ్రులు తరగతి టీచర్‌కు తెలియజేసినప్పటికీ చర్యలు తీసుకోకపోవడంతో పదేపదే లైంగిక వేధింపుల చర్యలు అధికమైనట్లు సమాచారం. బాధితురాలిని భయాందోళనకు కూడా గురిచేస్తున్నట్టు తెలిసింది.

వివరాల్లోకెళ్తే.. గత పదిరోజుల క్రితం పదో తరగతి బాలిక స్నానానికి వెళ్లిన సమయంలో ఎలక్ట్రిషియన్ ఆమెను వెంబడించిన్నట్లు తెలిసింది . లైట్లు ఆన్ ఆఫ్ చెక్ చేయాలనే పేరుతో బాలికను పిలిచాడు. ఆమెపై రెండు చేతులు వేసి అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో తీవ్ర భయాందోళనకు గురైన బాధితురాలు కొన్ని రోజుల తర్వాత ఇంటికి వెళ్లిన సమయంలో తల్లిదండ్రులకు విషయం చెప్పింది. దీంతో వారు టీచర్‌కు తెలియజేశారు. ఈ సమస్యను పరిష్కరిస్తామని, ఎవరికీ చెప్పొద్దని సదరు టీచర్ చెప్పినట్టు తల్లిదండ్రులు తెలిపారు. అయినప్పటికీ ఆ హాస్టల్‌లో ఉండలేనంటూ బాధితురాలు ఏడ్చినా.. పదో తరగతి పరీక్షలున్నాయని కన్నవాళ్లు సర్దిచెప్పారు. ఆ తర్వాత నిందితుడు బాలికను భయభ్రాంతులకు గురిచేస్తున్నట్టు తెలిసింది. దీంతో ఆ అమ్మాయి 'తాను భవనం పైనుంచి దూకి చనిపోతా'నంటూ తల్లిదండ్రులకు లేఖ రాయడంతో హుటాహుటిన వారు హాస్టల్‌కు చేరుకున్నారు. టీచర్లను సంప్రదిం చినప్పటికీ విషయం బయటకు చెప్పకండి.. సమస్యను పరిష్కరిస్తాం, అతన్ని మందలిస్తాం అంటూ దాటవేశారు. బాధితురాలి తండ్రి స్థానిక సర్పంచ్, స్థానికులకు విషయం తెలియజేశాడు. హాస్టల్‌లో ఎలక్ట్రిషి యన్‌గా పనిచేసే నిందితుడి చర్యలకు విద్యార్థినులు ఆందోళనకు గురవుతున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే భయభ్రాంతులకు గురిచేస్తుం డటంతో విద్యార్థులు హాస్టల్‌లో ఉండేందుకు ససేమిరా అంటున్నట్టు సమాచారం. ఈ ఘటనపై టీచర్లు కూడా వెంటనే స్పందించడం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు.

ఇట్టి విషయం తెలుసుకున్న అధికారులు గురుకుల పాఠశాలకు వెళ్లి విచారణ చేపట్టి స్థానిక ఎస్ఐ సుహాసిని నిందితుడు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

## ఆడబిడ్డలకు ఆరునెలల లోపే కల్యాణ లక్ష్మి చెక్కులు

### సర్పంచ్ కుంట లక్ష్మి రమేష్



భీమ్ గల్, బతుకమ్మ: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెన్లలైన ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి, శాదిముభారక్ చెక్కులో ఆరునెలల లోపు అందించడం జరుగుతుందని సర్పంచ్ కుంట లక్ష్మి రమేష్ అన్నారు. శనివారం బాల్కొండ కాన్స్టెన్సీ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ చొరవతో మంజూరైన, కళ్యాణ లక్ష్మి చెక్కులను సర్పంచ్ లబ్ధిదారులైన శ్రీ వొళ్ళాల పద్మ రామచందర్, ఏషాలా నర్సు గంగయ్య,గజాణవేణి భాగ్య అశోక్ గార్లకు అందజేశారు.ఈ సందర్భంగా ఈ చెక్కుల మంజూరుకు కృషి చేసిన ముత్యాల సునీల్ కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు...ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో, పెళ్లయి బిడ్డ పుట్టిన తర్వాత కూడ కళ్యాణ్ లక్ష్మి చెక్కులను ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సప్పల సత్యనారాయణ, పల్లె రామ్, బాజరెడ్డి అభిలాష్,డాక్టర్ సంతోష్ తెడ్డు బాలరాజు, బాపూరావు, షేఫీ,కోమిరే బూమేష్,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, రాజేశ్వర్ గౌడ్,కాంగ్రెస్ నాయకులు పల్లె శేఖర్, చాకలి గంగాధర్, ఉపాధ్యక్షులు రాజేందర్, గూండ్ల నరేందర్, కధీర్ కంటమ్ శేఖర్, మీసేవ దిలీప్, మెడికల్ సత్యం తదితరులు పాల్గొన్నారు.

## ధర్జిలకు లయన్స్ క్లబ్ అఫ్ ఆర్మూర్ సన్మానం



ఆర్మూర్, బతుకమ్మ : ప్రపంచ టైలర్స్ డే ను పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథాపురం ఆధ్వర్యంలో పట్టణంలోని దర్జీలను శనివారం ఘనంగా సన్మానించారు. ఇందులో భాగంగా కనుమరుగైన ధర్జీ వృత్తిని ఇప్పటికి జీవనోపాధిగా కొనసాగిస్తున్న ధర్జీలు శ్రీనివాస్, చంద్రశేఖర్ లను పూలమాల, షాలువాలతో సన్మానించారు. బ్రాండెడ్ షోరూమ్స్ పుట్టగొడుగుల్లా వచ్చిన దర్జీ వృత్తిని ఇంకా కొనసాగించడం అభినందనీయం అనిజోన్ చైర్మన్ చెరుకు పృథ్వీరాజ్, కోశాధికారి గుర్రం విజయానంద్ లు అన్నారు.ఈ కార్యక్రమంలో సభ్యులు సురేందర్ చంద్రయ్య లు పాల్గొన్నారు .

# పోలీసు క్రికెట్ టీమ్‌పై జ్యూడిషియల్ టీమ్ విజయం





నిజామాబాద్ సిటీ, బతుకమ్మ :నిజామాబాద్ జిల్లా జ్యూడిషియరి, జిల్లా పోలీసుల మధ్య శనివారం ఎడపల్లి మండల పరిధిలో గల జానకం పేట్ పోలీస్ ట్రైనింగ్ కేంద్రంలో జరిగిన ఫ్రెండ్లి క్రికెట్ మ్యాచ్ లో జ్యుడిషియరీ క్రికెట్ జట్టు విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన పోలీస్ జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 128 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన జ్యూడిషియరి జట్టు 11.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 129 పరుగులు చేసి విజయాన్ని సాధించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.వి.ఎన్ భారత లక్ష్మి విజేత జట్టు జ్యూడిషియరికి, రన్నర్ గా నిలిచిన పోలీస్ జట్టుకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కోర్టులు అనే నాలుగు గోడల మధ్య విధులు నిర్వహించే న్యాయధికారులు మైదానంలోకి వచ్చి వికెట్ల మధ్య పరుగెత్తుతు పరుగులు సాధించడం ఆనందదాయకమేనని అన్నారు. పోలీసులు అంటేనే ఫిట్నెస్ కలిగి ఉంటారని అలాంటి టీమ్ పై జ్యూడిషియరీ టీం విజయం సాధించడం గొప్ప విషయమేనని పేర్కొన్నారు. నిత్యం పని ఒత్తిడితో ఉండే వారికి క్రీడలు టానిక్ ల పని చేస్తాయని అన్నారు. న్యాయ, పోలీసు వ్యవస్థలకు అవినాభావ సంబంధం ఉన్నదని ఇలాంటి కార్యక్రమాలతో అవి మరింత బలపడతాయని అన్నారు. ఆటలో వికెట్ల కోసం, పరుగుల కోసం పరుగెత్తినట్లు కోర్టు కేసుల పరిష్కారంలో అంతే హుషారుగా వెళదామని ఆమె చమత్కరించారు. న్యాయం కోసం తపిస్తున్న సామాన్యుడే మనకు లక్ష్యం కావాలని, లక్ష్య సాధనలో మనమంతా కలిసి నడిచి న్యాయసేవలను కలిసి పంచుదామని అన్నారు. అందరూ ప్రతి రోజు ఆరోగ్య పరిరక్షణ కోసం సమయం వెచ్చించాలని జిల్లాజడ్జి సూచించారు. పోలీస్ కమిషనర్ సాయి చైతన్య మాట్లాడుతూ మా పోలీసులే ఫిట్నెస్ కలిగి ఉంటారని అనుకునే వాడినని కానీ న్యాయమూర్తులు ఫిట్నెస్ ముందు ఓడిపోయామని సరదాగా వ్యాఖ్యానించారు. ఎదో ఒక సమయంలో కలిసిపోయి కలిసికట్టుగా ఆటలు ఆడటంలోనే ఆనందం ఉన్నదని, అది శరీర దృఢత్వానికి దారి తీస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జిలు హరీష్, శ్రీనివాస్, దుర్గా ప్రసాద్, సీనియర్ సివిల్ జడ్జి సాయి సుధ, జూనియర్ సివిల్ జడ్జిలు ఖుష్బూ ఉపాధ్యాయ, గోపికృష్ణ, చైతన్య, హరి కుమార్, శ్రీనివాస్ రావు, కీర్తి రాజ్, అదనపు డిప్యూటీ పోలీస్ కమిషనర్ బస్వరెడ్డి, నిజామాబాద్ బోధన్, ఆర్మూర్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్లు ప్రకాష్, శ్రీనివాస్, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సందర్శించిన ఎమ్మెల్యే, కలెక్టర్, సీ.పీ





నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని శనివారం ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సందర్శించారు. అంతకుముందు మాతాశిశు ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్), క్రిటికల్ కేర్ యూనిట్ లతో కూడిన భవన సముదాయాన్ని పరిశీలించారు. సుదీర్ఘ కాలం నుంచి పలు పనులు పెండింగ్ లోనే ఉండడం గమనించిన ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి ఒకింత అసహనం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జీ.జీ.హెచ్ లో కొనసాగుతున్న ప్రసూతి సేవల విభాగాన్ని వెంటనే ఎం.సీ.హెచ్ లోకి మార్చాలని ఆదేశించారు. అనంతరం జీజీహెచ్ లో ఆసుపత్రి పనితీరుపై సంబంధిత వైద్యులతో ప్రభుత్వ సలహాదారు, కలెక్టర్ ఇలా త్రిపాఠి సమీక్ష జరిపారు. ఒక్కో విభాగం వారీగా రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న డాక్టర్లు, సిబ్బంది ఖాళీలు, కొత్తగా అందుబాటులోకి వచ్చిన సౌకర్యాలు, ఇంకనూ సమకూర్చాల్సి ఉన్న సదుపాయాలు తదితర వాటి గురించి ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి వైద్య విభాగాల అధిపతులను అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలను మరింతగా మెరుగుపర్చాలని, అవసరమైన అన్ని వసతులు సమకూరుస్తామని సూచించారు. వివిధ వైద్య సేవల కోసం ప్రతిరోజు 2000 మంది వరకు అవుట్ పేషంట్ రోగులు జీజీహెచ్ కు వస్తున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకొని అన్ని విభాగాల పనితీరు మెరుగుపడేలా చూడాలన్నారు. అన్ని విభాగాలలో 180 మంది వైద్యులు, సరిపడా సిబ్బందితో పాటు అధునాతన వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు జీజీహెచ్ ఆసుపత్రి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీ సేవలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మేజర్, మైనర్ సర్జరీలతో పాటు షుగర్, బీపీ, డెంగ్యూ, మలేరియా, థైరాయిడ్ వంటి వ్యాధి నిర్ధారణ టెస్టులు ఉచితంగా చేస్తారని, ప్రైవేట్ ఆసుపత్రుల్లో వీటికి వేల రూపాయల రుసుము వసూలు చేస్తారని అన్నారు. అన్ని విభాగాలలో ప్రైవేట్ తో పోలిస్తే ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే నిపుణులైన వైద్యులు, వారికి అనుబంధంగా వైద్య విద్యను అభ్యసిస్తున్న మెడికోలు ఉన్నారని గుర్తు చేశారు. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా జీజీహెచ్ లో కీలు మార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తుండడం జరుగుతోందని, డెంటల్ విభాగం ఆధ్వర్యంలో ఎంతో ఖర్చుతో కూడుకుని ఉన్న సర్జరీలను కూడా స్థానికంగా చేస్తున్నారని అన్నారు. విద్యా, వైద్య రంగాల పని తీరును మరింతగా మెరుగుపర్చాలనే కృత నిశ్చయంతో ప్రభుత్వం ముందుకెళ్తోందని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆసుపత్రికి అవసరమైన ఆధునాతన వైద్య పరికరాలు, ఇతర మౌలిక సదుపాయాల కోసం నిధులు మంజూరు చేయిస్తున్నామని గుర్తు చేశారు. కొంతమంది సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రత్యేకించి బయోమెట్రిక్ హాజరు వేసుకుని వెళ్ళిపోతున్న సిబ్బందిపై గట్టి నిఘా ఉంచాలన్నారు. సమీక్షలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రాములు, వివిధ విభాగాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

# ఇంగ్లీష్ పరీక్ష ప్రశాంతం

### 319 మంది విద్యార్థులు గైర్హాజరు

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ :ఇంటర్ పరీక్షల్లో భాగంగా శనివారం రెండవ సంవత్సరం ఇంగ్లీష్ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని, 98 శాతం విద్యార్థులు హాజరయ్యారని జిల్లా ఇంటర్ విద్యా అధికారి రవికుమార్ తెలియజేశారు. 16,248 మంది విద్యార్థులకు గాను 15,929 మంది విద్యార్థులు హాజరయ్యారని, 319 మంది గైర్హాజర్ అయ్యారని తెలియజేశారు. జనరల్ లో మొత్తం 13,885 మంది విద్యార్థులకు గాను 13,624 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. ఒకేషనల్ లో 2,363 మంది విద్యార్థులకు గాను 2,305 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలియజేశారు.

జిల్లాలో మొత్తం 58 పరీక్షాల కేంద్రాల్లో 51 పరీక్ష కేంద్రాలను శనివారం జిల్లా ఇంటర్ విద్య కన్వీనర్, తనతో పాటు జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు, హై పవర్ కమిటీ, సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ లు మొత్తం 54 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి పర్యవేక్షించామని తెలియజేశారు.

జిల్లా ఇంటర్ విద్యా అధికారి తిరుమలపుడి రవికుమార్ 6 జూనియర్ కళాశాలల్లో తనిఖీ చేసి పర్యవేక్షించారు.